# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 28, మార్చి 2026


### భైంసాలో శోభాయాత్రకు

# భారీ బందోబస్తు

✪ ఎస్పీ డా. జి. జానకి షర్మిల



**భైంసా, మార్చి 27, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా భైంసాలో నిర్వహించనున్న శ్రీరామ నవమి శోభాయాత్రకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల తెలిపారు. సుమారు 300 మంది పోలీసు సిబ్బందితో పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. శోభాయాత్ర బందోబస్తుపై శుక్రవారం ఆమె పోలీసు అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పట్టణంలోని ముఖ్య ప్రాంతాలు, రద్దీ కూడళ్లలో ప్రత్యేక బలగాలను మోహరించినట్లు చెప్పారు. డ్రోన్ మిగతా 2లో..

# అంగరంగ వైభవంగా రాములోరి కళ్యాణం..



✪ శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న మంత్రి వివేక్

✪ హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

✪ భక్తులతో కలసి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి

**మందమర్రి, మార్చి 27, ప్రభాతవార్త**

శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి మందమర్రి పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని హనుమాన్ ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి రాష్ట్ర ప్రజలందరికీ శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముడి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. సీతారాముల దాంపత్యం ప్రపంచానికి ఆదర్శమని, కుటుంబ బంధాల విలువలను శ్రీరాముడు తన జీవితంతో చూపించారని మంత్రి పేర్కొన్నారు. లోపలి పేజీల్లో..

### సబ్సిడీ యంత్ర పరికరాలను

# రైతులు వినియోగించుకోవాలి

✻ ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్

✻ 40 శాతం సబ్సిడీతో మంజూరైన డ్రోన్ స్ప్రే మెషిన్లను రైతులకు అందజేత

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 27, ప్రభాతవార్త :**

ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాల ద్వారా అందుబాటులో ఉన్న వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులు పూర్తిగా వినియోగించుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎస్ఎంఎం పథకం కింద కొత్తపేట ప్రాథమిక వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో కొత్తపేట సొసైటీ కార్యాలయంలో శుక్రవారం రైతులకు డ్రోన్ స్ప్రే మెషిన్లు మిగతా 2లో..



### వైద్యునిపై దాడి ఘటనలో నిందితులపై

# కఠిన చర్యలు



● జిల్లాలో వైద్య సేవలకు ఎటువంటి అంతరాయం లేదు

● నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, మార్చి 27, ప్రభాతవార్త:**

జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యునిపై గురువారం చోటుచేసుకున్న దాడి ఘటనను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తీవ్రంగా ఖండించారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. శుక్రవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేస్తూ, ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడానికి వీల్లేదని హెచ్చరించారు. అరాచకానికి పాల్పడే వారిపై నిర్దాక్షిణంగా వ్యవహరిస్తామని తెలిపారు. ఈ ఘటనపై ఇప్పటికే పూర్తిస్థాయి విచారణ కొనసాగుతోందని, మిగతా 2లో..

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గోధుమ పంట దగ్ధం

**నేరడిగొండ, మార్చి 27, ప్రభాతవార్త:**

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా చేతికి వచ్చిన పంట కళ్లముందే బూడిదవ్వడంతో ఒక రైతుకు భారీ నష్టం వాటిల్లింది. నేరడిగొండ మండలం తేజాపూర్ గ్రామానికి చెందిన రైతు తీగల వెంకటరమణకు చెందిన గోధుమ పంట శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు 10 క్వింటాళ్ల గోధుమ పంట అగ్నికి ఆహుతైంది. దీని విలువ సుమారు 30 వేల రూపాయలు ఉంటుందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి పండించిన మిగతా 2లో..



# అంగరంగ వైభవంగా రాములోరి కళ్యాణం..

(మొదటిపేజీ తరువాయి)

తల్లిదండ్రులు, భార్య, కుటుంబ సభ్యుల పట్ల ప్రేమాభిమానాలు ఎలా ఉండాలో శ్రీరాముడి జీవితం స్ఫూర్తినిస్తుందని అన్నారు. రాముడు చూపిన మార్గంలో నడిస్తే సమాజంలో నైతిక విలువలు పెంపొందుతాయని, శ్రీరామ రాజ్యం ప్రజలకు ఆదర్శ పరిపాలనకు నిదర్శనమని వివరించారు. కష్టకాలంలో ధైర్యంగా నిలబడే విధానం నుంచి ధర్మపాలన వరకు శ్రీరామచంద్రుని జీవితం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**వాంకిడి, మార్చి 27, ప్రభాతవార్త :**

శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని వాంకిడి మండలం లోని బంబారా గ్రామంలోని రామాలయం లో సీతారాముల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకకు మాజీ జడ్పీటీసి పారుపల్లి అజేయ్ కుమార్ కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆధ్యాత్మిక శోభతో పులకించిన ప్రాంగణంవేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల మధ్య సీతమ్మ తల్లి, రామచంద్ర స్వామిల కల్యాణ కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం ఖగజై శ్రీరామ్ఁగఁ నామస్మరణతో మారుమోగింది. మాజీ జడ్పీటీసి అజేయ్ కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి, లోక కల్యా ణం జరగాలని, గ్రామాభివృద్ధి ఆకాంక్షిస్తూ స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. భక్తులకు అన్నదాన వితరణ, కల్యాణం అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసి మాట్లాడుతూ.. ఖగసీతారాముల కల్యాణం లోకానికి ఆదర్శమని, స్వామివారి సేవలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమనిఁగ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

**మంచిర్యాల రూరల్, మార్చి 27 , ప్రభాతవార్త:**

పాతమంచిర్యాలలోని అతిపురాతనమైన శ్రీ రామలింగేశ్వర ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా ఆలయంలో అంగరంగ వైభవంగా కనుల పండుగగా శ్రీ సీతారాముల కళ్యాణమహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు కుటుంబసభ్యులతో పాటు పాల్గొని సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాతమంచిర్యాల ఆలయ అభివృద్ధితో పాటు వెనుకబాటుకు గురైన పాతమంచిర్యాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని తెలిపారు. ప్రజలందరూ సీతారాముల ఆశీర్వాదంతో సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. కళ్యాణం సందర్భంగా గోనె భాగ్యలక్ష్మి ౹శ్యామ్ సుందర్ రావు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పారాయణం మహిళా సభ్యులు, హనుమాన్ స్వాములు, భక్తులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



సీతారాముల కళ్యాణం లో పాల్గొన్న మాజీ జెడ్పీటిసి అజయ్ కుమార్



# కార్మిక సంఘాలను బదనాం చేసే విధానాలు మానుకోవాలి

**- మెడికల్ బోర్డు నిలిపివేతపై ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యలు సరికావు**

**- సిఐటియు డిప్యూటీ జనరల్ సెక్రటరీ అల్లి రాజేందర్**



**నస్పూర్, మార్చి 27, ప్రభాతవార్త**

కార్మిక సంఘాలను బదనాం చేసే విధానాలు మానుకోవాలి" అని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) డిప్యూటీ జనరల్ సెక్రటరీ అల్లి రాజేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్.కె న్యూటెక్ గనిలో పిట్ సెక్రటరీ పెరుక సదానందం ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలు తెలుసుకోవడానికి వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మెడికల్ బోర్డు నిలిపివేతకు కార్మిక సంఘాల ఫిర్యాదులే కారణమని అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను రాజేందర్ తీవ్రంగా ఖండించారు. మెడికల్ బోర్డు ఇన్వాలిడేషన్ల వల్ల సంస్థపై ఆర్థిక భారం పడుతుందని చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం నుండి సింగరేణికి రావాల్సిన బకాయిల చెల్లింపుపై భట్టి విక్రమార్క ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో మెడికల్ బోర్డు ఆపబోమని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి, గెలిచిన తర్వాత మాట మార్చడం కార్మికుల పట్ల ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని తెలియజేస్తోంది. మెడికల్ బోర్డులో జరిగిన అవినీతికి బాధ్యులైన వారిని పట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడ్ లను రాష్ట్రంలో అమలు చేయబోమని కేరళ తరహాలో అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. నైనీ ప్రాజెక్టులోని అవకతవకలపై బాధ్యులెవరో ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. పది నెలలుగా ఆగిపోయిన మెడికల్ బోర్డును వెంటనే ప్రారంభించాలని రాజేందర్ డిమాండ్ చేశారు. ఏఐటియుసి అనుసరిస్తున్న ద్వంద్వ విధానాలను కార్మికులు గమనిస్తున్నారని హెచ్చరించారు. అన్ని సంఘాలను కలుపుకొని సమ్మె నోటీసు ఇచ్చి పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కస్తూరి చంద్రశేఖర్, అల్వాల అభిలాష్, లింగమూర్తి, పోలు సంపత్ పాల్గొన్నారు.

## సబ్సిడి యంత్ర పరికరాలను

# రైతులు వినియోగించుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ముఖ్య అతిథిగా పాల్గొని 40 శాతం సబ్సిడీతో మంజూరైన డ్రోన్ స్ప్రే మెషిన్లను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా సిర్పూర్ నియోజకవర్గంలోని పీఏసీఎస్ కొత్తపేట, పీఏసీఎస్ దహేగావ్, పీఏసీఎస్ గురుడుపేట సంఘాలకు ఈ డ్రోన్ స్ప్రే యంత్రాలను పంపిణీ చేశారు. ఏవైనా సందేహాలు ఉంటే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) వెంకటి, వ్యవసాయ అధికారి (ఏఓ) రామకృష్ణ, సహాయ వ్యవసాయ అధికారి (ఏఈఓ) రేష్మిత, సొసైటీ సీఈఓలు సతీశ్, బక్కయ్య, రాజేష్, రైతులు, కార్యకర్తలు, డ్రోన్ ప్రతినిధులు, డీలర్లు పాల్గొన్నారు.

# భైంసాలో శోభాయాత్రకు భారీ బందోబస్తు

(మొదటిపేజీ తరువాయి)

కెమెరాలు, సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగిస్తూ ప్రతి కదలికను పర్యవేక్షిస్తామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా భక్తులు, ప్రజలు సహకరించాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## వైద్యునిపై దాడి ఘటనలో

# నిందితులపై కఠిన చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ఘటన నేపథ్యంలో జిల్లాలో వైద్య సేవలకు ఎటువంటి అంతరాయం కలగలేదని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు యథావిధిగా పనిచేస్తున్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సాధారణ ఓపీ సేవలతో పాటు అత్యవసర వైద్య సేవలు కూడా నిరంతరాయంగా కొనసాగుతున్నాయని వివరించారు. ప్రజారోగ్యానికి భంగం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, వైద్యులకు రక్షణ కల్పించడంతో పాటు శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గోధుమ పంట దగ్ధం

(మొదటిపేజీ తరువాయి)

పంట చేతికందే సమయంలో ఇలా జరగడంతో కన్నీరుమున్నీరయ్యారు. ప్రభుత్వం మరియు విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, జరిగిన నష్టానికి పరిహారం అందించి తనను ఆదుకోవాలని ఆయన వేడుకున్నారు.

# పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తాం

**- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు**

**- పవర్ లక్ష్మి కుటుంబానికి**

**రూ. 2.50 లక్షల ఎల్ఓసీ అందజేత**

**నస్పూర్, మార్చి 27, ప్రభాతవార్త**

పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్‌కు చెందిన పవర్ లక్ష్మి ఆరోగ్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ. 2,50,000 ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రాన్ని శుక్రవారం ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ప్రేమ్ సాగర్ రావు చెప్పారు. పవర్ లక్ష్మి కుటుంబ సభ్యులు తమ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించి ఈ నిధులను మంజూరు చేయించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నిరుపేదలకు ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోందని ఆయన వివరించారు. భవిష్యత్తులోనూ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు చేరువ చేస్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే చొరవ పట్ల లక్ష్మి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 31వ డివిజన్ కార్పొరేటర్ తాళ్ల సంపత్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ఎల్ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు

# సింగరేణి ప్రమాద బీమా బాధిత కుటుంబాలకు కొండంత అండ

**శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్ - ప్రమాదంలో కాళ్లు కోల్పోయిన కార్మికుడికి కోటి రూపాయల చెక్కు పంపిణీ**

నస్పూర్, మార్చి 27, ప్రభాతవార్త

సింగరేణి ప్రమాద బీమా బాధిత కుటుంబాలకే కాదు ప్రమాదవశాత్తు శాశ్వత అంగవైకల్యం పొందిన వారికి సైతం ఆర్థికంగా భరోసా కల్పిస్తోందని శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియాలోని జీఎం కార్యాలయంలో 2024 మార్చిలో జరిగిన గని ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన ఎస్సార్పీ 1 కార్మికుడు సత్యనారాయణకు కోటి రూపాయల బీమా చెక్కును అందజేశారు. యూనియన్ బ్యాంక్ అధికారులతో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాతీయ బ్యాంకుల్లో జీతం ఖాతా కలిగి ఉన్న ఉద్యోగులకు కోటి నుండి కోటి పాతిక లక్షల రూపాయల వరకు ఉచిత ప్రమాద బీమా అందుతోందని వివరించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా లాంటి సంస్థలు మరణంతో పాటు వైకల్యానికి సైతం భారీ నష్టపరిహారం ఇస్తున్నాయని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఈ సదుపాయం కల్పిస్తోంది. బీమా దరఖాస్తు ప్రక్రియలో ఆలస్యం జరిగినా యూనియన్ బ్యాంక్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని కోటి రూపాయలు మంజూరు చేయించడం అభినందనీయమన్నారు. ఈ ఆర్థిక సాయం సత్యనారాయణ కుటుంబానికి భవిష్యత్తులో ఎంతో ఆసరాగా నిలుస్తుందని ఆకాంక్షించారు. ఉద్యోగులందరూ యాజమాన్యం కల్పిస్తున్న ఈ ఉచిత బీమా పథకంపై అవగాహన పెంచుకోవాలని కోరారు. యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ అపర్ణ రెడ్డి మాట్లాడుతూ ఏటీఎం కార్డు కలిగి ఉండటం ద్వారా మరో పది లక్షల రూపాయల అదనపు బీమా లభిస్తుందని చెప్పారు. బ్యాంక్ ఇన్సూరెన్స్ కవరేజీని కోటి పాతిక లక్షల రూపాయలకు పెంచినట్లు జోనల్ హెడ్ రవీంద్ర బాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం ప్రతినిధి కొమురయ్య, ఏజీఎం సుమలత, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, డీజీఎం అనిల్ కుమార్, పిఓలు సురేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న జీఎం మునిగంటి శ్రీనివాస్


భైంసా మండలం కామోల్ బస్టాండ్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నవ యూత్ సభ్యులు

## కామోల్‌లో చలివేంద్రం ప్రారంభం

**- నవ యూత్ అధ్యక్షుడు గుమ్మల్ల నగేష్**

భైంసా, మార్చి 27, ప్రభాతవార్త:

వేసవి కాలాన్ని పురస్కరించుకుని ప్రయాణికులు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు భైంసా మండలం కామోల్ గ్రామంలో శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. నవ యూత్ ఆధ్వర్యంలో గత 18 ఏళ్లుగా ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు గుమ్మల్ల నగేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ రహదారిపై ఉన్న బస్టాండ్ వద్ద ప్రయాణికులకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నవ యూత్ ఉపాధ్యక్షుడు పోల్గాం యోగేష్, సభ్యులు దయాకిరణ్, ఎస్. రమేష్, డి. వెంకటేష్, భోజన్న, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


చింతగూడ కోయవాగులో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

## అభయాంజనేయ స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం

కాగజ్‌నగర్ రూరల్, మార్చి 27, ప్రభాతవార్త :

శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని చింతగూడ కోయవాగు గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల సేవే భగవంతుని సేవ అనే భావంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో ఐక్యత, భక్తి భావాలు పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు, మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రేపల్లెవాడలో బోరింగ్ ప్రారంభం

తాండూర్, మార్చి 27, ప్రభాతవార్త :

మండలంలోని రేపల్లెవాడ గ్రామంలో గల హనుమాన్ ఆలయం వద్ద శుక్రవారం డిసిసి ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డితో కలిసి కొత్తపల్లి సర్పంచ్ ఆకుల వెంకటేష్ స్విచ్ ఆన్ చేసి బోరింగ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రెండు లక్షల 50 వేల రూపాయల డిఎంఎఫ్టి నిధులతో బోరింగ్ వేయించడం జరిగిందన్నారు. హనుమాన్ ఆలయానికి వచ్చే భక్తులకు, సమీప ప్రజలకు నీటి సమస్య తీరిందన్నారు. కార్యక్రమంలో వార్డ్ మెంబర్ చొప్పదండి రాజేశ్వరి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


బోర్‌ను ప్రారంభించిన సర్పంచ్ వెంకటేష్

## ఈస్గాం పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్ఐగా చంద్రశేఖర్ బాధ్యతల స్వీకరణ

కాగజ్‌నగర్ రూరల్, మార్చి 27, ప్రభాతవార్త :



కాగజ్‌నగర్ మండలం ఈస్గాం పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్ఐగా చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సిసిఎస్ రామగుండం కమిషనరేట్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన కళ్యాణ్ వి.ఆర్ ఆసిఫాబాద్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో చంద్రశేఖర్ నియమితులై బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలకు న్యాయం జరిగేలా, శాంతి భద్రతలను కాపాడేందుకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించి నేరాల నివారణలో భాగస్వాములు కావాలని కోరారు.



## 108 అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ

బెజ్జూర్, మార్చి 27, ప్రభాతవార్త :

బెజ్జూర్ మండలంలోని 108 అంబులెన్సును శుక్రవారం ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున వడ దెబ్బకు గురైన పేషెంటుకు అందించవలసిన చికిత్స, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. అంబులెన్స్ ఎల్లవేళలా మండలంలో అందుబాటులో ఉండాలని కేసు వచ్చిన వెంటనే స్పందించి త్వరగా పేషేంట్ దగ్గరకి చేరుకోవాలని, చికిత్స అందిస్తూ దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని ఈఎంటి మదూకర్, పైలెట్ సతీష్ కు సూచించారు.

## కొమురం భీమ్ జిల్లాలో ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గం ఏర్పాటు చేయాలి

**- దళిత యువజన సంఘం డిమాండ్**

కాగజ్‌నగర్ రూరల్, మార్చి 27, ప్రభాతవార్త :

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో షెడ్యూల్డ్ కాస్ట్ (ఎస్‌సి)లకు ప్రత్యేక నియోజకవర్గ రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ దళిత యువజన సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఈర్ల సునీల్, మాజీ కౌన్సిలర్ గొడిసేలా ఎల్లేష్, నాయకులు ఐల్ల శంకర్, బోగా తిరుపతి మాట్లాడుతూ జిల్లా వెనుకబడిన ప్రాంతాలలో ఒకటిగా ఉన్నప్పటికీ, ఇక్కడ ఎస్సీ జనాభా గణనీయంగా ఉన్నదని తెలిపారు. అయినప్పటికీ, వారికి తగిన రాజకీయ ప్రాతినిధ్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం ప్రకారం సామాజిక న్యాయం, సమాన హక్కుల కోసం ఎస్సీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించబడినప్పటికీ, కొమురం భీమ్ జిల్లాలో ఆ ఉద్దేశ్యం సక్రమంగా నెరవేరడం లేదన్నారు. దీనివల్ల ఎస్సీ సమాజానికి చెందిన ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి, సామాజిక సమానత్వం, ప్రజాస్వామ్య బలోపేతం కోసం జిల్లాలో కనీసం ఒక నియోజకవర్గాన్ని ఎస్సీ రిజర్వ్‌గా ప్రకటించాలని వారు కోరారు. ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు 5 కౌన్సిలర్ ఐ పోచం, వేల్పుల ప్రదీప్, గోగర్ల దుర్గయ్య, మారుతి, మచ్చ నరేందర్, కాల్వల చైతన్య, రవి, ఆశీర్వాదం, దుర్గయ్య, రాజయ్య, అల్లూరి సాయి, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దళిత యువజన సంఘం నాయకులు

# వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం

**కోటపల్లి, మార్చి 27 ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం రాంపూర్ గ్రామంలో శ్రీ సీతారాముల వారి కల్యాణ మహోత్సవం అత్యంత కనుల పండువగా జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేద మంత్రోచ్చారణల నడుమ, మంగళ వాయిద్యాల సాక్షిగా జరిగిన సీత సమేత రామచంద్ర స్వామి కల్యాణంలో ఆయన స్వయంగా పాల్గొని, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురాణం సతీష్ కుమార్ గారు మాట్లాడుతూ.. ఆ సీతారాముల ఆశీస్సులు రాంపూర్ గ్రామ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడం శుభ సూచకమని, భక్తి మార్గం మనిషికి మానసిక ప్రశాంతతను ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆలయ కమిటీ వారు సతీష్ కుమార్ గారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**జన్నారం, మార్చి 27, ప్రభాతవార్త**

ధర్మం,న్యాయం, సత్యానికి రూపం శ్రీరామచంద్రమూర్తులు అయితే పతివ్రత, సహనం, భక్తికి ప్రతిరూపం సీతాదేవి, అదేవిధంగా శ్రీరాముడు విష్ణువు అవతారం అయితే సీతాదేవి లక్ష్మీదేవి అవతారం.అందుకే హిందువులు అత్యంత భక్తితో కొలిచే దేవతలుగా నిలిచిపోయారు. తండ్రి మాట నిలపడానికి 14 సంవత్సరాలు వనవాసానికి వెళ్ళాడు. ఇది ధర్మం, న్యాయం పట్ల ఆయనకున్న అంకితభావం తెలియచేస్తుంది. వనవాసంలో ఉన్నప్పటికీ సీతాదేవి శ్రీ రాముని పట్ల చూపిన భక్తి, ప్రేమ అనన్యమైనది . అందుకే ఈ కాలంలో పెళ్ళైన జంటలను సీతా రాముల్లతో పోలుస్తారు. శ్రీ సీతారాముల వారి సందేశాలు ప్రజలకు ఆధ్యాత్మిక మార్గంలో నడవడానికి, సత్యం, ధర్మం, ప్రేమ పట్ల నిజాయితీగా ఉండడానికి స్ఫూర్తినిస్తాయి. అందుకే ప్రతి సంవత్సరం శ్రీరామనవమి రోజున జరిగే శ్రీ సీతారాముల కల్యాణం అత్యంత భక్తి శ్రద్ధలతో తిలకిస్తారు. ఈ కోవలోనే జన్నారం మండలం లోని కిష్టాపూర్, రెండ్లగూడెం, కలమడుగు,రాంపూర్ అలాగే పలు గ్రామాల్లోని శ్రీరాముని దేవాలయాల్లో అదేవిధంగా మండల కేంద్రము లోని సీతారాముల దేవాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం రమణీయంగా, కమనీయంగా, అంగరంగ వైభవంగా పెద్ద సంఖ్యలో హాజరైన భక్తుల జరిగింది. మండల కేంద్రము లోని శ్రీ రాముడు దేవాలయంలో పురోహితులు గుండి నరహరి శర్మ, గుండి సత్యనారాయణ శర్మ, గుండి గణేష్ శర్మ లు గుడి ఆవరణలో ఏర్పాటు చేసిన ఆలయ కమిటీ సభ్యుల దంపతులు ఆసీనులు కాగా వేదమంత్రోచ్చారణలతో శ్రీ సీతారాముల విగ్రహ మూర్తులకు కళ్యాణోత్సవం నిర్వచించారు. మొదటగా శ్రీ సీతారాముల వారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విగ్రహమూర్తులకు అభిజిత్ లగ్నం ముహూర్తంలో దేవతల శిరస్సు పై జిలకర బెల్లం కార్యక్రమాన్ని నిర్వహించారు.అదేవిధంగా మాంగల్య సూత్ర ధారణ నిర్వచించారు. ఆ సమయంలో భక్తుల జై శ్రీరామ్, జైశ్రీరామ్ నినాదాలతో దేవాలయ ప్రాంగణం పరవశించిపోయింది.అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భోజనాలు చేశారు. ఈ శ్రీ సీతారాముల కల్యాణం సమయంలో భక్తులు శ్రీరామ నామ స్మరణతో పరవశించిపోయారు. అక్కడ అంతా ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడింది.

## రేండ్ల గూడెంలో ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన..

జన్నారం మండలం రెండ్లగూడేం గ్రామంలోని దేవాలయ ఆవరణలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణం కార్యక్రమంలో నటరాజ కళాక్షేత్రం చిన్నారులు చేసిన నృత్యం భక్తులను ఆకట్టుకుంది. సీతారాముల కళ్యాణోత్సవం ఘట్టాన్ని నృత్య ప్రదర్శన ద్వారా అద్భుతంగా ప్రదర్శించారు.

**జైపూర్,మార్చి 27,ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో శుక్రవారం సీతారాముల కల్యాణం మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. పవర్ ప్లాంట్ ఈడి చిరంజీవి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య,భక్తిప్రపత్తులతో జైశ్రీరాం నినాదాల నడుమ ఒక్కో ఘట్టం కమనీయంగా సాగింది.కల్యాణోత్సవం లో భాగంగా జీలకర్ర బెల్లం ఘట్టం,మంగళసూత్రధారణ, తలంబ్రాలను చల్లుకునే ప్రక్రియలను పండితులు సాంప్రదాయ బద్దంగా నిర్వహించగా, చూసిన భక్తులు పులకించిపోయారు.

**నస్పూర్, మార్చి 27, ప్రభాతవార్త**

నస్పూర్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. రామనవమి సందర్భంగా శుక్రవారం ఉదయం 11 గంటల 5 నిమిషాలకు పునర్వసు నక్షత్రయుక్త అభిజిత్ లగ్న సుముహూర్తాన ఈ వేడుకను నిర్వహించారు. శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్ దంపతుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవం వైభవంగా సాగింది. మునిగంటి శ్రీనివాస్-ఉమారాణి దంపతులు తమ నివాసం నుండి మంగళ వాయిద్యాల నడుమ తలంబ్రాలతో కళ్యాణ ప్రాంగణానికి చేరుకున్నారు. వారికి ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య నియమ నిష్టలతో జరిగిన ఈ కార్యక్రమంలో దంపతులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలో భక్తులు భారీగా పాల్గొని రామనామ స్మరణతో తరించారు. వేసవి తాపం దృష్ట్యా భక్తుల కోసం మజ్జిగ సౌకర్యం కల్పించారు. సీతారాముల కళ్యాణం అనంతరం పానకంతో పాటు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని జీఎం దంపతులతో పాటు రాంపూర్ ఏరియా అధికారులు స్వీకరించారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, స్థానికులు ఈ కళ్యాణాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, ఏజీఎం (ఫైనాన్స్) సుమలత, ఐకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏవీ రెడ్డి, ఎస్సార్పీ ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ చిప్ప వెంకటేశ్వర్లు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర రెడ్డి, డీజీఎం దామోదర్, న్యూటెక్ గని మేనేజర్ కూరపాటి శ్రీనివాస్, సీనియర్ పీఓ సురేందర్, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**చెన్నూరు, మార్చి 27, ప్రభాతవార్త**

సీతారాముల కళ్యాణం చూసేందుకు శుక్రవారం భక్త జనులు తండోప తండాలుగా దేవాలయాలకు తరలి వచ్చి ఆ రఘుకుల తిలకుని కళ్యాణం కనులారా వీక్షించి మురిసిపోయారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండల వ్యాప్తంగా భక్తజనులు శుక్రవారం జానకి రాముల కళ్యాణాన్ని కన్నుల పండుగగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా చెన్నూరు మండలంలోని ఆస్నాద్ గ్రామంలో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని మాజీ జడ్పీటీసీ సభ్యులు బెల్లంకొండ కరుణ సాగర్ రావు, గ్రామ సర్పంచ్ బెల్లంకొండ సజిత, జగన్మోహన్ రావుల ఆధ్వర్యంలో వేదపండితులతో కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చూసేందుకు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు, భక్తులు, వేలాదిగా తరలివచ్చి కళ్యాణాన్ని కనులారా చూసి తరించి పోయారు. కళ్యాణం అనంతరం స్వామి వారి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముత్యాల సాయి, గ్రామ పెద్దలు వెంకటేశ్వర్ రావు, రాజమోహన్ రావు, బాపుగౌడ్, రాజన్న, ప్రజలు పాల్గొన్నారు.

**బెల్లంపల్లి, మార్చి 27, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలో శ్రీరామ నవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది. పట్టణంలోని శ్రీ కోదండ రామాలయంలో జరిగిన ఈ వేడుకలు భక్తి శ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి వారి సతీమణి రమాదేవి కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ నిర్వాహకులు మరియు స్థానిక నాయకులు ఎమ్మెల్యే దంపతులకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే దంపతులు సీతారాముల కళ్యాణ వేడుకలను ప్రత్యక్షంగా వీక్షించి, స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల ఆశీస్సులు తీసుకొని, నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా జీవించాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి దంపతులను ఆశీర్వదిస్తూ సీతారాముల కృపతో ఆయురారోగ్యాలు కలగాలని ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు, కౌన్సిలర్లు, అధికారులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





రాంపూర్‌లో శ్రీ సీతారాముల కళ్యాణ ఉత్సవం





సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తులు



సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తులు



కళ్యాణ మహోత్సవం వేడుకల్లో ఎమ్మెల్యే దంపతులు




సీతారాముల శోభాయాత్ర


సీతారాముల కళ్యాణానికి హాజరైన భక్తులు

# కన్నుల పండువగా సీతారాముల కల్యాణం

**జైనూర్, మార్చి 27, ప్రభాతవార్త:**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలో శ్రీరామ నవమి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం స్వామివారి విగ్రహాలను వాహనాలపై అలంకరించి ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. భక్తుల జై శ్రీరామ్ నామస్మరణతో జైనూర్ పురవీధులు మారుమోగాయి. అనంతరం స్థానిక హనుమాన్ ఆలయ కల్యాణ మండపంలో పురోహితులు కులకర్ణి పండిత్ మహారాజ్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఈ వేడుకల్లో మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కొడప ప్రకాష్, మాజీ సహకార చైర్మన్ కొడప హన్ను పటేల్, ఉప సర్పంచ్ డోంగ్రే ప్రకాష్, విశ్వహిందూ పరిషత్ నాయకులు, వివిధ పార్టీల ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**సారంగాపూర్, మార్చి 27, ప్రభాతవార్త:**

మండలంలోని జాం, స్వర్ణ గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. లోక కల్యాణం కోసం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక ఘట్టాన్ని వీక్షించేందుకు వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించి భక్తులు పునీతులయ్యారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, స్థానిక నాయకులు, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**మందమర్రి, మార్చి 27, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. పట్టణంలోని పలు ఆలయాల ప్రాంగణాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడగా, వేద మంత్రోచ్ఛారణల మధ్య భక్తుల రామనామ స్మరణలతో వేడుకలు ఘనంగా సాగాయి. ఈ సందర్భంగా కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి సతీసమేతంగా పట్టణంలోని పలు ఆలయాలను సందర్శించి కళ్యాణ మహోత్సవాల్లో పాల్గొన్నారు. భక్తులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందమర్రి పాల చెట్టు ప్రాంతంలో గల పంచముచ దేవస్థానంలో జరిగిన కళ్యాణ మహోత్సవానికి మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ హాజరై కార్యక్రమాన్ని వీక్షించారు. అదేవిధంగా చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి పట్టణంలోని పలు ఆలయాలను సందర్శించి కళ్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. వీరితో పాటు తహసీల్దార్ సతీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ తుర్కపల్లి రాయలింగు తదితర అధికారులు, నాయకులు హాజరయ్యారు. అత్యంత సుందరంగా అలంకరించిన ఆలయాల్లో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య సీతారాముల దివ్య కళ్యాణం కమనీయంగా నిర్వహించబడింది. భక్తులు భారీ సంఖ్యలో హాజరై రామనామ స్మరణతో భక్తి పారవశ్యానికి లోనయ్యారు. పట్టణంలో హనుమాన్ దీక్ష స్వాములు ప్రత్యేక సేవల్లో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. పలు ఆలయాలలో భక్తుల సౌకర్యార్థం తాగునీరు, మజ్జిగ, భోజన వసతులు సమకూర్చారు. భక్తుల రద్దీ దృష్ట్యా పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టి ఎటువంటి అంతరాయం లేకుండా కార్యక్రమాలు సాఫీగా జరిగేలా పర్యవేక్షించారు. మొత్తంగా మందమర్రి పట్టణం ఆధ్యాత్మిక శోభతో నిండిపోయి, భక్తి భావంతో కళ్యాణ మహోత్సవాలు ఘన విజయాన్ని సాధించాయి.

**నిర్మల్, మార్చి 27, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా సిర్గాపూర్ గ్రామంలోని ప్లేయర్ హైస్కూల్‌లో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. చైత్ర శుద్ధ నవమిని పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శ్రీరాముని చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కె.వి. నరసింహారెడ్డి మాట్లాడుతూ.. శ్రీరాముడు ధర్మం, సత్యం, కర్తవ్య నిష్టకు నిలువెత్తు రూపమని కొనియాడారు. తండ్రి మాట కోసం రాజ్యాన్ని వదిలి అరణ్యవాసానికి వెళ్లిన ఆయన జీవితం నేటి తరం విద్యార్థులకు క్రమశిక్షణ, త్యాగనిరతిని నేర్పుతుందని తెలిపారు. శ్రీరాముని ఆదర్శాలను ప్రతి విద్యార్థి తమ జీవితంలో అలవర్చుకోవాలని సూచించారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు శ్రీరాముని వేషధారణలో పాల్గొని అలరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు రామాయణ విశిష్టతను, శ్రీరాముని జీవిత చరిత్రను వివరించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**భైంసా, మార్చి 27, ప్రభాతవార్త:**

భైంసా మండలం కామోల్ గ్రామంలో శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. గత 400 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయాన్ని అనుసరిస్తూ గ్రామస్థులు సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక రామాలయంలో జరిగిన ఈ వేడుకలో గ్రామ ప్రజలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ.. సీతారాముల కల్యాణం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను పెంచుతాయని పేర్కొన్నారు. సుమారు 30 మంది భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. గ్రామమంతా ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరిసింది.


**పెంచికల్‌పేట్, మార్చి 27, ప్రభాతవార్త :**

పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూర్, ప్రసన్నంజనేయ ఆలయం, సంజీవ్ నగర్ లోని కోదండ రామాలయంలో శుక్రవారం భక్తిశ్రద్దలతో శ్రీ రామ నవమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎల్లూరులో నూతన పంచలోహ విగ్రహాలకు తొలిసా కళ్యాణ వేడుకలు జరిపారు. కోదండ రామాలయంలో కన్నులపండువగా గ్రామస్తుల సమక్షంలో వేడుకలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిక్కిరిసినాయి. పురోహితుల వేదమంత్రాల నడుమ ఆధ్యాత్మిక శోభాతో సీతారాముల కళ్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అనిల్ కుమార్, సర్పంచ్ రవీందర్, ఆలయాల కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

**బెజ్జూర్, మార్చి 27, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మండల కేంద్రంతో పాటు కుష్ణపల్లి, ఎల్కపల్లి, సిద్ధాపూర్, లంబడి గూడ, ఊట్సారంగపల్లి, కుకుడ, పాపన్నపేట్, తలాయి, మొగవెల్లి, గెర్రెగూడ, సొమిని, సుశ్మీర్, తదితర గ్రామాల్లో గ్రామస్తులు సీతారాముల కల్యాణాన్ని ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. దీంతో మండలంలోని ఆయా గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామాల్లో సీతారాముల ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో హనుమాన్ దీక్ష దారులు ఈ వేడుకల్లో పాల్గొని జై శ్రీరామ్ నినాదాలతో ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు. సీతారాముల కళ్యాణం ఆద్యంతం భక్తులు ఎంతో భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆయా గ్రామాల ప్రజలు, హనుమాన్ దీక్ష దారులు పాల్గొన్నారు.


జాం గ్రామంలో భక్తిశ్రద్ధల మధ్య శాస్త్రోక్తంగా జరుగుతున్న సీతారాముల కల్యాణోత్సవం




సీతారాముల కళ్యాణంలో పాల్గొన్న భక్తులు


కామోల్ గ్రామంలో సీతారాముల కల్యాణోత్సవం


శ్రీరాముని వేషధారణలో అలరిస్తున్న విద్యార్థులు, పాఠశాల సిబ్బంది

# ఘనంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం

**✻ భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు ✻ మారుమ్రోగిన శ్రీరామ నామస్మరణ**



**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 27, ప్రభాతవార్త :**

శ్రీ రామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని కాగజ్‌నగర్ పట్టణంలోని పలు దేవాలయాల్లో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో డా. కొత్తపల్లి శ్రీనివాస్ – డా. కొత్తపల్లి అనిత దంపతులు పాల్గొని స్వామివారి దివ్య ఆశీస్సులు పొందారు. పట్టణంలోని ఈఎస్ఐ పరిధిలోని అభయ ఆంజనేయ దేవాలయం, శ్రీ త్రినేత్ర శివాలయం, వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయం, రైల్వే రామాలయం, మారుతి నగర్ హనుమాన్ ఆలయం, నౌగాంబస్తీ విద్యానగర్ తదితర ప్రధాన దేవాలయాల్లో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డా. కొత్తపల్లి శ్రీనివాస్ – అనిత దంపతులు మాట్లాడుతూ శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొని దివ్య ఆశీస్సులు పొందడం తమ అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. భక్తుల అచంచలమైన భక్తి, ఆలయ నిర్వాహకుల అంకితభావం ఈ వేడుకలకు మరింత వైభవాన్ని తీసుకువచ్చాయని కొనియాడారు. శ్రీరాముడు ధర్మం, సత్యం, న్యాయాలకు ప్రతీకగా నిలిచారని, ఆయన చూపిన మార్గంలో నడిస్తేనే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వర్ధిల్లుతాయని చెప్పారు. ఈ పవిత్ర పండుగ ప్రతి ఒక్కరి ఇంటిలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు నింపాలని వారు ఆకాంక్షి ంచారు.

**తాండూర్, మార్చి 27 ప్రభాతవార్త :**

మండలంలోని మాదారం, ఐబి, రేపల్లెవాడ, బోయపల్లి, తదితర గ్రామాలలోని శ్రీరామ, ఆంజనేయ స్వామి ఆలయాల్లో శుక్రవారం సీతారాముల కళ్యాణ ఉత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. వేద పండితులు, ఆలయాల అర్చకులు మంత్రోచ్చారణతో సీతారాముల కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సీతారాముల కళ్యాణం ఉత్సవానికి మహిళలు భక్తులు అధిక సంఖ్యలో తల్లి రావడంతో ఆలయాలు కిక్కిరిసిపోయాయి. కళ్యాణోత్సవం అనంతరం భక్తులు మహిళలు సీతారాములను దర్శించుకున్నారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు వడపప్పు, పానకం, తీర్థ, అన్న ప్రసాద వితరణ చేశారు. మండలంలోని ఐబిలో ఆంజనేయ స్వాములు శోభయాత్రను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ నామస్మరణతో ఆలయాలు, పురవీధులు మారుమోగాయి.

**చింతలమానేపల్లి, మార్చి 27, ప్రభాతవార్త :**

మండలంలోని కర్జెల్లి గ్రామ హన్మాన్ భక్తుల జైశ్రీరామ్ నినాదాలతో మారుమోగాయి. భక్తులు కాషాయ దుస్తులు ధరించి, హనుమాన్ జెండాలు పట్టుకుని ఎంతో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో దేవతామూర్తులను ఊరేగిస్తూ గ్రామమంతా తిరిగారు. మధ్యలో భజనలు, మంగళ వాద్యాలు, తాళాలు మ్రోగిస్తూ భక్తులు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద



వివాహం జరిపించిన నిరుపేద జంట

సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ శోభాయాత్ర గ్రామంలో భక్తి, ఐక్యత, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచింది. ఊరేగింపు అనంతరం కర్జెల్లి గ్రామంలోని ఓంకార్ ఆశ్రమంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమం ప్రాంగణం పూలతో అలంకరించబడగా, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పూజారులు వేద మంత్రోచ్చారణల మధ్య శ్రీ సీతారాముల దివ్య కళ్యాణాన్ని నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దర్శించుకొని పుణ్యఫలాన్ని పొందారు. కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలు, మంగళహారతులు నిర్వహించగా, భక్తులు భజనలు, కీర్తనలు చేశారు. ఈ వేడుకలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ దండేవిటల్ పాల్గొని సీతారాముల కల్యాణ మహోత్సవానికి పాల్గొనీ రాధాకృష్ణులను దర్శించుకున్నారు. అలాగే ఎస్ ఐ ఇస్లావత్ నరేష్ దంపతులు రాధాకృష్ణులను దర్శించుకుని సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సీతారాముల కల్యాణ మహోత్సవం గ్రామంలో భక్తి, ఐక్యతను పెంపొందిస్తూ ఆధ్యాత్మిక స్ఫూర్తిని నింపిందనీ ఓంకార ఆశ్రమ రాధాకృష్ణ మందిర ఆలయ కమిటీ తెలిపారు.

## సీతారాముల కల్యాణ వేడుకలో నిరుపేద జంటకు వివాహం..

**పెంచికల్‌పేట్, మార్చి 27, ప్రభాతవార్త**

పెంచికల్ పేట్ మండలంలోని మోర్లిగూడ గ్రామంలో శ్రీ సీతారాముల కల్యాణ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సందర్భంగా గ్రామ సర్పంచ్ పోర్తెటీ వెంకటేష్ సామాజిక సేవకు నిదర్శనంగా నిలిచారు. పేద కుటుంబానికి చెందిన కనక మధు నిశాలి యువ జంటకు తన ఆధ్వర్యంలో వివాహం జరిపించి ఆదర్శంగా నిలిచారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ జంటకు గ్రామ పెద్దలు యువకులు గ్రామస్తుల సహకారంతో వివాహాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు


**రెబ్బెన, మార్చి 27, ప్రభాతవార్త :**

రెబ్బెన గ్రామంలోని శ్రీ రామాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఉత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి, వేద మంత్రాల నడుమ సీతారాముల కళ్యాణం వైభవంగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఉత్సవ ఏర్పాట్లు సమగ్రంగా నిర్వహించగా, గ్రామస్థులు సహకారం అందించారు. కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు భోజన వసతులు కల్పించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామంలో భక్తి భావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. గ్రామ ప్రజలు ఈ కార్యక్రమాన్ని ఆనందంగా స్వాగతిస్తూ, ప్రతి సంవత్సరం ఇలాంటి ఉత్సవాలు నిర్వహించాలని కోరుతున్నారు.

**కెరమెరి, మార్చి 27, ప్రభాతవార్త :**

మండల కేంద్రం నెహ్రూ నగర్ కాలనీ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు ఉదయం నుంచి భక్తులు భారీగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు పండితులు మాపూజి మంత్రోచ్ఛరణల తో శ్రీ సీతారాముల కళ్యాణం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి తిరుపతి, దండవుల శ్రీనివాస్ మంజుల రవి తదితరులు పాల్గొన్నారు.






కాగజ్‌నగర్‌లో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న డా. కొత్తపల్లి శ్రీనివాస్ - అనిత దంపతులు



మంగళ సూత్రాన్ని చూపిస్తున్న పండితులు



# జన్నారంను అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటు చేయాలి

## ఏప్రిల్ 6న నిర్వహించే ఛలో మంచిర్యాల కార్యక్రమం విజయవంతం చేయాలి

**జన్నారం, మార్చి 27, ప్రభాతవార్త**

జన్నారంను అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటు చేయాలని ఏప్రిల్ 6న నిర్వహించే చలో మంచిర్యాల కార్యక్రమాన్ని వివిధ సంఘాలు మద్దతు తెలిపి విజయవంతం చేయాలని జన్నారం అసెంబ్లీ నియోజకవర్గ సాధన కమిటీ అధ్యక్షులు గవ్వల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు, సామాజిక వేత్తలు, మేధావులతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా జన్నారం అసెంబ్లీ నియోజకవర్గ సాధన కమిటీ అధ్యక్షులు గవ్వల శ్రీకాంత్ మాట్లాడుతూ జన్నారం అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటు చేస్తే ఇక్కడి ప్రజలకు, వ్యాపారస్తులకు, విద్యార్థి యువకులకు అబివృద్ధి ఏ విధంగా చెందుతుంది అనేక అంశాలపై క్లుప్తంగా వివరించారు. అదేవిధంగా రిటైర్డ్ ఉద్యోగులు, జన్నారం డెవలప్మెంట్ అధ్యక్షులు శ్రీరాముల కొండయ్య మాట్లాడుతూ టైగర్ జోన్ ఏర్పడక ముందు తరువాత జన్నారం మండల ప్రజల పరిస్థితులు ఏ విధంగా ఉందో పూర్తిగా వివరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కనికరం అశోక్ అసెంబ్లీ నియోజకవర్గం కావాలంటే ప్రతి ఒక్కరు ఉద్యమాలలో పాల్గొనాలని కోరారు. లేకుంటే భవిష్యత్ లో జన్నారమే కనుమరుగయే పరిస్థితి ఉందన్నారు. అదేవిధంగా సర్పంచుల పోరం మండల ప్రధాన కార్యదర్శి పవార్ దినేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులందరం ఉద్యమాలలో పాల్గొంటామని గ్రామ పంచాయతీలలో తీర్మానాలు చేస్తామని



ప్రత్యేక్షంగా ఉద్యమాలలో పాల్గొంటామని అన్నారు వడ్డెర సంఘం మండల అధ్యక్షులు బొంతల లక్ష్మణ్ మాట్లాడుతు టైగర్ జోన్ ఏర్పడి మా వృత్తినే దెబ్బ తీసిందని పనులు లేక పస్తులు ఉండే పరిస్తితి వచ్చిందని అన్నారు. మ్యాదారి సంఘం మండల కార్యదర్శి కోడిజుట్టు రాజన్న మాట్లాడుతూ మా కులం వెదురు బొంగు పై అడవి ఉత్పతులపై ఆధారపడి జీవిస్తే అసలు వృత్తే కనుమరుగు అయ్యే పరిస్థితి ఉందని అన్నారు. సీపీఎం మండల కార్యదర్శి కొండగుర్ల లింగన్న మాట్లాడుతూ ఏది ఏమైనా ఉద్యమాల ద్వారానే అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడుతుందని అన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్లా మాట్లాడుతు టైగర్ జోన్ పేరుతో అడవిని నమ్ముకొని ఉన్న ఆదివాసులదర్ని అడవి నుండి తరుముతున్నారని కనీసం వారికి జీవనోపాధి లేకుండా పోయిందని అన్నారు. మహిళా సంఘం నాయకురాలు జయ మాట్లాడుతూ పోరాటంలో మహిళలను అందరినీ దించుతామని అన్నారు. సామాజిక కార్యకర్తలు కొండపల్లి మహేష్ మామిడి విజయ్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల ఉపాధ్యక్షులు కూకటికారి బుచ్చన్న మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులందరు ఈ పోరాటంలో పాల్గొంటామని అన్నారు. సీఐటీయూ నాయకులు దాసండ్ల రాజన్న అంబటి లక్ష్ముుుుణ్‌లు తదితరులు పాల్గొని వారి వారి అభిప్రాయాలు చెబుతూ ఉద్యమాలు చేయాలని అందులో ముందు ఉంటామని అన్నారు. అదేవిధంగా ఏప్రిల్ మొదటి వారంలో జన్నారం మండలంలో ఉన్న ప్రజా ప్రతినిధులతో సమావేశం ఉంటుందని సాధన కమిటీ అధ్యక్షులు గవ్వల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఏప్రిల్ 6న పెద్ద ఎత్తున అన్ని వర్గాల ప్రజలు కలిసి రావాలని కోరారు. జన్నారం మండల ప్రజలు ప్రతి ఒక్కరు స్మార్ట్ ఫోన్‌లలో, ఫేస్ బుక్, ట్విట్టర్, వాట్సఫ్, ఇన్‌స్టాగ్రామ్ స్టేటస్‌లో జన్నారంను అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటు చేయాలని అందరు పెట్టుకోవాలని గవ్వల శ్రీకాంత్ కోరారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పనులు వేగవంతం

**- తహసీల్దార్ మధుకర్**

**కాగజ్‌నగర్, మార్చి 27, ప్రభాతవార్త :**



ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ–2025లో భాగంగా మండలంలో పనులు వేగంగా కొనసాగుతున్నాయి. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) ఇంటింటికీ పర్యటిస్తూ ఓటర్ల మ్యాపింగ్, కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం కాగజ్‌నగర్ మండల తహసీల్దార్ పోలింగ్‌బూత్ నంబర్లు 107, 98, 79, 77 పరిధిలోని ప్రాంతాలను సందర్శించి, బీఎల్‌ఓలతో పనుల పురోగతిని సమీక్షించారు. ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు చేయాలని, ప్రతి అర్హుడైన వ్యక్తి ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పౌరులు తమ ఆధార్, చిరునామా వివరాలు వంటి సమాచారాన్ని ఖచ్చితంగా అందించి తీలివీలకు సహకరించాలని తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు. తప్పులు లేకుండా ఓటర్ల జాబితాను సిద్ధం చేయడం ప్రజాస్వామ్యానికి కీలకమని పేర్కొన్నారు. అలాగే, కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఓటర్‌గా నమోదు కావాలని, మారిన చిరునామాలు, పేర్లలో ఉన్న పొరపాట్లను సరిదిద్దుకునే అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా మండలంలోని ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో ఉండేలా లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ, బీఎల్‌ఓలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సహాయం

**జన్నారం, మార్చి 27, ప్రభాతవార్త**

గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి 18300 రూపాయల ఆర్థిక సహాయం మహేంద్ర సంఘం నాయకులు అందచేశారు. జన్నారం గ్రామానికి చెందిన శనిగారపు మహేష్ గత కొన్ని రోజులుగా కాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మహేంద్ర సంఘం నాయకులు మహేష్ స్వగృహానికి వెళ్లి ఆర్థిక సహాయం అందించారు. ఇందులో రెండు వేల రూపాయలు ప్రెస్ క్లబ్ తరఫున ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలువేరు నర్సయ్య, పిల్లి మల్లయ్య, కోడిజుట్టు రాజన్న, పర్ల కనకయ్య, నగురు కిషన్, సంధ గోపాల్, పిల్లి అంజయ్య, నగురు మహేందర్, మధిర శ్రీనివాస్, సంద కృష్ణ, మధిర సతీష్, పర్ల శంకర్, కనికరపు సుధాకర్, గుడ్ల రాజన్న, జాజాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్పీజీ అక్రమ నిల్వలపై కఠిన చర్యలు: జైనూర్ ఎస్సై రవికుమార్

**జైనూర్, మార్చి 27, ప్రభాతవార్త:**



దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జైనూర్ ఎస్సై రవికుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను హోటళ్లు, టీ దుకాణాలు వంటి వాణిజ్య అవసరాలకు వాడటం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడినా, నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసినా ఎస్సెన్షియల్ కమోడిటీస్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో అక్రమ రీఫిల్లింగ్ కేంద్రాలపై దాడులు చేసి సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమాలకు పాల్పడే వారి లైసెన్సులు రద్దు చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు అపోహలు నమ్మి అనవసరంగా ఇంధనాన్ని నిల్వ చేయవద్దని, అక్రమ నిల్వలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలని కోరారు.

# రోడ్డు ప్రమాదంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మృతి

**నేరడిగొండ, మార్చి 27, ప్రభాతవార్త:**



ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి లక్ష్మణ్ రోడ్డు ప్రమాదంలో మరణించారు. శుక్రవారం నేరడిగొండ మండలం కుప్టిఘాట్ సమీపంలో జరిగిన ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. లక్ష్మణ్ మృతి పట్ల పలువురు నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# స్వచ్ఛ గ్రామం లక్ష్యంగా లింగాపూర్‌లో పారిశుద్ధ్య కార్యక్రమాలు

**లింగాపూర్, మార్చి 27, ప్రభాతవార్త:**



గ్రామాన్ని స్వచ్ఛంగా, ఆరోగ్యకరంగా మార్చే లక్ష్యంతో లింగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్య కార్యక్రమాలు జోరుగా కొనసాగుతున్నాయి. సర్పంచ్ జాదవ్ రాజశేఖర్ ఆధ్వర్యంలో గ్రామంలోని కాలువలు, చెత్త పేరుకుపోయిన ప్రాంతాలను శుభ్రం చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. సర్పంచ్ స్వయంగా పనులను పర్యవేక్షిస్తూ కార్మికులతో కలిసి కాలువలను శుభ్రం చేయించడం ద్వారా ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. చెత్త తొలగింపు, నిల్వ నీటిని నివారించడం వంటి చర్యలతో గ్రామంలో వ్యాధుల నివారణకు కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలు కూడా సహకరించి చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గ్రామస్థులు ఈ కార్యక్రమాలను అభినందిస్తూ, ఇలాంటి పారిశుధ్య చర్యలు నిరంతరం కొనసాగించాలని కోరుతున్నారు. గ్రామపంచాయతీ చేపట్టిన ఈ కార్యక్రమాలు గ్రామ అభివృద్ధికి తోడ్పడుతున్నాయని వారు పేర్కొన్నారు.

# వార్డు ప్రజల సమస్యలు తీర్చేందుకు కృషి చేస్తా..

## గడప గడపకు తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్న కౌన్సిలర్ అజీమొద్దిన్

**చెన్నూరు, మార్చి 27, ప్రభాతవార్త**



మున్సిపల్ ఎన్నికల్లో 17 వ వార్డు కౌన్సిలర్ గా నాపై నమ్మకంతో నన్ను గెలిపించిన నా వార్డు ప్రజలకు ఏలాంటి సమస్యలు వచ్చినా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని కౌన్సిలర్ అజామొద్దిన్ అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాలిటీలో 17వ వార్డు కౌన్సిలర్ అజామొద్దిన్ ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలపై అడిగి తెలుసుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా 17 వ వార్డులో నెలకొన్న ప్రజా సమస్యలపై గడప గడపకు తిరిగి వార్డులో నెలకొన్న సమస్యల గురించి ప్రజలను నేరుగా అడిగి తెలుసుకున్నానని తెలిపారు. వార్డులో నెలకొన్న సమస్యలపై అధికారులతో చర్చించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ కొట్టే సాయికిరణ్, చెన్నూర్ ఏఎంసి డైరెక్టర్ జైనుల్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా అశోక చక్రవర్తి జయంతి

**వాంకిడి మార్చి 27, ప్రభాతవార్త :**



అశోక చక్రవర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బౌద్ధ సంఘ నాయకులు

దేవానాం ప్రియదర్శి సామ్రాట్ అశోక్ చక్రవర్తి 2330 వ జయంతిని శుక్రవారం వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్ యందు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షులు మార్షల్ దుర్గం సందీప్ మాట్లాడుతూ ధమ్మ నాయక్ దేవానాం ప్రియదర్శి చక్రవర్తి సామ్రాట్ అశోకుడు మౌర్య పరిపాలనలో ప్రజలందరికి కనీస అవసరాలు త్రాగు, సాగు నీరు అందించడం ఆ కాలంలో గ్రామాలకు రోడ్డు వసతులు కల్పించి రోడ్డుకి ఇరువైపుల చెట్లు నాటి ప్రజా సేవార్థం రోడ్డు పక్కన బావులు తవ్వించి తాగు నీరు అందించారని రాజ్యంలో అహింస మార్గం ద్వారా మానవ సేవ చేశారు. పశు పక్షుల పోషణతో వ్యవసాయ రంగాన్ని ఉన్నత స్థానంలో ఉంచి ధా న్య కారాగారాలు నిర్మించారని, రాజ్యంలోని అన్ని వర్గాల వారిని గౌరవిస్తు పరమత సంస్కృతిని గౌరవించి ప్రజలలో ప్రియదర్శిగా పేరు పొందారని అలాగే శిలాశాసనాల ద్వారా బౌద్ధాన్ని ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి అదే కాలంలో తక్షశిల, నలంద వంటి విశ్వవిద్యాలయాలు కట్టి ప్రజలందరికి విద్యని అందించిన మహా మానవత వాది మహా చక్రవర్తి అశోకుడు అని సారనాథ్ బోధగయ లుంబినీ నాగార్జున కొండ వంటి అనేక ప్రాంతాల లో స్తూపాలను నిర్మించి బౌదం ధమ్మాన్ని ప్రచారం ప్రసారం చేశారని సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షులు మార్షల్ దుర్గం సందీప్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమాజ పెద్దలు దుర్గం శ్యాంరావు, రాజేశ్వర్, అంబేద్కర్ యువజన సంఘం సంయుక్త కార్యదర్శి రోషన్ ఉప్రె , నాయకులు ప్రకాష్ ఉప్రే, రమేష్ డోంగ్రే ,రమేష్ జాడే ,తిరుపతి కోబ్రాగడే, సమతా సైనిక్ దళ్ మార్షల్స్ ఉపేందర్, ప్రతాప్, మిలింద్, స్వాగత్, సచిన్, కమలాకర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సెక్యూరిటీ గార్డ్‌ని వెంటనే విధుల్లోకి తీసుకోవాలి: హెచ్ఎంఎస్

**జైపూర్, మార్చి 27, ప్రభాత వార్త**

సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో విధులు నిర్వహించిన సెక్యూరిటీ గార్డ్ తుంగపిండి శివరాం ను వెంటనే అధికారులు విధుల్లోకి తీసుకోవాలని హెచ్ఎంఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. హెచ్ఎంఎస్ నాయకులు మాట్లాడుతూ ప్లాంటు అధికారులు అంతర్గత తగాదాలను కారణంగా చూపిస్తూ గార్డ్‌ని డ్యూటికి తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. గార్డ్‌ని విధుల్లోకి తీసుకోవాలని జైపూర్ పోలీసులు నాన్ అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇచ్చినప్పటికి అధికారులు మాత్రం కమిటీ పేరుతో ఆలసత్వం వహిస్తున్నారని నాయకులు మండిపడ్డారు. గార్డు కు న్యాయం జరగకపోతే హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో ప్లాంటు గేటు ముందు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. తుంగ పిండి శివరాం అనే కార్మికుడికి ఉద్యోగం ఇవ్వడంలో జాప్యంపై ప్లాంట్ డీజీఎం పర్సనల్ కిరణ్ బాబుని వివరణ కోరగా ఈ సమస్యపై తమ కమిటీ దృష్టిలో ఉందని తెలిపారు. త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ నాయకులు విక్రమ్ కుమార్, ప్రదీప్ రెడ్డి, సాయి కృష్ణ రెడ్డి, సంపత్, సత్యనారాయణ చారి, నర్సింహారెడ్డి, నవీన్ చారి తదితరులు పాల్గొన్నారు.

# అంకుసాపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 27, ప్రభాతవార్త :**



సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన సర్పంచ్ మోహన్

కాగజ్‌నగర్ మండలంలోని అంకుసాపూర్ గ్రామ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. అంకుసాపూర్ గ్రామంలో సర్పంచ్ కుర్సంగ్ మోహన్ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పనులు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) నిధులతో చేపట్టడం జరుగుతుందని సర్పంచ్ తెలిపారు. గ్రామంలోని పలువురు కాలనీల్లో మట్టి రోడ్ల కారణంగా వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ సీసీ రోడ్డు నిర్మాణానికి గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. పనులు పూర్తయితే రవాణా సౌకర్యం మెరుగుపడి, రోజువారీ జీవనం సులభమవుతుందని తెలిపారు. గ్రామ అభివృద్ధి తమ ప్రధాన లక్ష్యమని, దశలవారీగా అన్ని వసతులను అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులను సమర్థంగా వినియోగించి గ్రామంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. పనుల ప్రారంభ కార్యక్రమంలో వార్డు మెంబర్, సొగల వసంత్ రావు, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, కొనేరి శేషగిరి రావు, గౌత్రే మురళీధర్ రావు, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.




## మంచిర్యాలలో మెడికల్ రిప్స్

# క్యాండిల్ లైట్ ర్యాలీ

**- అఖిలేష్‌కు న్యాయం చేయాలంటూ డిమాండ్**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 27, ప్రభాతవార్త**

అలెంబిక్ ఫార్మా యాజమాన్యం వేధింపుల కారణంగా మరణించిన మెడికల్ రిప్రజెంటేటివ్ జె. అఖిలేష్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (టీఎంఎస్ఆర్యు) మంచిర్యాల శాఖ ఆధ్వర్యంలో గురువారం రాత్రి భారీ క్యాండిల్ లైట్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం (డాక్టర్ స్ట్రీట్) నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు సాగిన ఈ ర్యాలీలో వందలాది మంది మెడికల్ రిప్రజెంటేటివ్స్ పాల్గొని నిరసన తెలిపారు. అ చలేష్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో టీఎంఎస్ఆర్యు రాష్ట్ర కార్యదర్శి ఎల్. సాగర్ రెడ్డి మాట్లాడుతూ, అలెంబిక్ ఫార్మా మేనేజ్‌మెంట్ అనుసరిస్తున్న అప్రజాస్వామిక, అనైతిక విధానాలే అఖిలేష్ మృతికి కారణమని ఆరోపించారు. ఘటనకు బాధ్యులైన అధికారులను తక్షణమే విధుల్లోంచి తొలగించి, పోలీస్ శాఖ నిస్పక్షపాతంగా విచారణ జరిపి దోషులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బాధిత కుటుంబానికి తగిన నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే ఫార్మా రంగంలో సేల్స్ ప్రమోషన్ ఉద్యోగులపై పెరుగుతున్న పని ఒత్తిడి, వేధింపులను అరికట్టేందుకు ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని, కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సేల్స్ ప్రమోషన్ ఉద్యోగుల కోసం కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధమైన పని విధానాలను రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దగ్గర శ్రీకాంత్, టీఎస్ఆర్యు జిల్లా కార్యదర్శి వి. సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి పట్టణంలోని జాతికుంట చెరువు సుందరీకరణకు శంకుస్థాపన

**- రూ.1.56 కోట్లతో పనులు ప్రారంభం**

**బెల్లంపల్లి, మార్చి 27, ప్రభాతవార్త**

బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జాతికుంట చెరువు సుందరీకరణ పనులకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి శంకుస్థాపన చేశారు. రూ.1 కోటి 56 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. జాతికుంట చెరువు సుందరీకరణ పనులు పూర్తయ్యాక ఈ ప్రాంతం మరింత ఆకర్షణీయంగా మారి ప్రజలకు విశ్రాంతి కోసం మంచి వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. చెరువు పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ పచ్చదనాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటామని, ప్రజలకు మెరుగైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యమని తెలిపారు. పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, బెల్లంపల్లిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య, మున్సిపల్ చైర్మన్ దావ స్వాతి రమేష్ బాబు, 25వ వార్డు కౌన్సిలర్ కంకటి ప్రణీత, 9వ వార్డు కౌన్సిలర్ కంపెల్లి రాజం, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

